

గాంధీచౌరస్తాలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బీఆర్ఎస్ బహిరంగ సభకు తరలిరావాలి: ఎమ్మెల్యే

చంపాపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవాల బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం చంపాపేట డివిజన్‌లోని గాంధీచౌరస్తా, కర్మన్‌ఘాట్ విలేజీ, బైరామల్‌గూడలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బహిరంగ సభకు కేసీఆర్ హాజరై నాయకులు, కార్యకర్తలకు దశదిశ నిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌కు పార్టీ కేటాయించిన వాహనాలలో సభకు బయలు దేరాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, నాయకు లు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, అంజిరెడ్డి, బొక్కా సదానంద్‌రెడ్డి, గూడూరు మధుసూదన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, మధుసాగర్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలి

చంపాపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీలో ఎంపీ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాలనీ ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు దెంది శశిదర్‌రెడ్డి, నాయకులు, కాలనీ ప్రతినిధులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, రాజునాయక్, సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కొత్తపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎల్ కాలనీలో తాగునీటి పైప్ లైన్ లో ఎక్కడ మురుగునీరు కలుస్తుందో జలమండలి అధికారులు గుర్తించి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ మరమ్మతు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో కలుషిత నీటి సరఫరా సమస్య ఉంటే పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు సుధాకర్, బాకారం సత్యనారాయణ, దత్తాత్రేయ, బీజేపీ నాయకులు గట్టు మహేష్‌కుమార్, సుందర్‌నారాయణ, అశ్విన్‌సింగ్, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోండి

వనస్థలిపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో నివాసముండే రోహిత్‌పటేల్ అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం అధిక మొత్తం ఖర్చు అయ్యాయి. దీంతో బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కార్పొరేటర్ సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.60వేల చెక్కును కార్పొరేటర్ బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే అహ్మద్ బలాల బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 92మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. అత్యవసరంగా వైద్య సేవలందుకుని ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత నిచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం : చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ టీడీపీ అడహక్ కమిటీ సభ్యుడు గడ్డె విజయ్‌నేత ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్‌కాలనీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాటసారులు, వాహనదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే చలివేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పంపన వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, దశరథ్‌నేత, అశోక్, వేణు పాల్గొన్నారు.

తెలంగాణ చేనేత కార్మికుల ఫెడరేషన్ కార్యవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ చేనేత కార్మికుల ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్రం సురేందర్ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం చిన్నరావిరాల గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ నూతన అధ్యక్షుడిగా గుర్రం సురేందర్, ఉపాధ్యక్షుడిగా జాలిగం బాలలింగేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మాధవి, సంయుక్త కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా ధనలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శరత్‌చంద్, యాదయ్యను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ చేనేత కార్మికు లు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయారని అన్నారు.

దుర్గానగర్‌కాలనీ సంక్షేమ సంఘం..

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్ ఇన్ఫర్‌మేషన్ కాలనీ సమీపంలోని దుర్గానగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎనుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భూమగొండ బీరప్పయాదవ్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్. సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పృథ్వీరాజ్, కామోజీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా స్వాతి, సంయుక్త కార్యదర్శులుగా జగ్రామ్‌నాయక్, కోశాధికారిగా రవిగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా పుష్పలత, గౌరవ సలహాదారులుగా కృష్ణయ్య, సురెపల్లి శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా సావిత్రమ్మ, సరిత, అనిత, అజిత్, సుమన్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చిన్నారులకు విధిగా టీకాలు వేయించాలి

ఓల్డ్‌మలక్‌పేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ విధిగా టీకాలు, వ్యాక్సిన్‌లు క్రమం తప్పకుండా వేయించాలని హైదరాబాద్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డి.శ్రీధర్ తల్లిదండ్రులకు సూచించారు. చిన్న పిల్లలకు స్పెషల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం కొనసాగుతుంది. అందులో భాగంగా బుధవారం ఓల్డ్‌మలక్‌పేటలో జరుగుతున్న ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేయడం వల్ల భవిష్యత్తులో వారిని వ్యాధుల నుంచి కాపాడవచ్చన్నారు. ఈనెల 28వ తేదీ వరకు చిన్నపిల్లలకు స్పెషల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం జరుగుతుంది. వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి వ్యాధినిరోధక టీకాలు, వ్యాక్సిన్‌లు ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు. ఎస్పీహెచ్‌ఓ బ్రిజు స్నీసా, పీహెచ్ఎన్ రామేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించిన బార్ అసోసియేషన్

రంగారెడ్డి జిల్లా కోర్టులు: పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. బుధవారం బార్ అసోసియేషన్‌లో జరిగిన సమావేశంలో ఉగ్రదాడుల్లో మృతులకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదుల పట్ల కేంద్రం కఠినవైఖరి అవలంబించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, బార్ కౌన్సిలర్ సభ్యులు అనంతసేనారెడ్డి, మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, రామారావు, లింగం, దేవరాజ్‌గౌడ్, ఇంద్రవర్ధన్ పాల్గొన్నారు.

తప్పులు సరిదిద్దడానికే భూ భారతి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల్లో దొర్లిన తప్పులను సరిదిద్దడానికే ప్రభుత్వం భూ భారతి ఆర్ఓఆర్ చట్టం 2025ని తీసుకురావడం జరిగిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. భూభారతి చట్టంపై రైతులకు బుధవారం హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టంపై ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ధరణి స్థానంలో కొత్తగా ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకురావడం జరిగిందని



సరూర్‌నగర్ వార్డు కార్యాలయంలో సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

గుర్తుచేశారు. ఈ చట్టం వల్ల ఎంతో కాలంగా పెండింగులో ఉన్న భూ సమస్యలు, సరిహద్దు గెట్ల పంచాయతీలు సులువుగా తీరుతాయని తెలిపారు. ప్రతి కమతానికి భూధార్ నంబర్, రైతుకు ఉన్న భూమికి హద్దులతో కూడిన రెవెన్యూ స్కెచ్ ఉంటుందన్నారు. భవిష్యత్తులో భూ సమస్యలు లేకుండా ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టంలో అనేక లాభాలు ఉన్నాయన్నారు. వారసత్వంగా వచ్చిన భూములపై 30 రోజుల్లో తహసీల్దార్ విచారణ జరిపి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడం జరుగుతుంది. గడువు మించి పోతే రిజిస్ట్రేషన్ అయినట్లుగానే భావించడం జరుగుతుందన్నారు. గతంలో మాదిరిగా రైతులు సీసీఎల్ఏ లాంటి కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేదన్నారు. సాధ్యమైనంత వరకు తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గ్రామ అధికారి నాలుగు రకాల రికార్డులను నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు, రైతులు, నాయకులు, అధికారులు కలిసి సమన్వయంతో పనిచేస్తే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు. కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డిలు హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్లలోని భూ సమస్యలను కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ జానకి, సూపరింటెండెంట్ అనీల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ స్వేత, ఆర్ఐలు నర్సింహ యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

త్వరలో సర్వేయర్ల నియామకం

సరూర్‌నగర్ : రైతులకు మేలు చేసేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, దీని ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్తవ భూవిస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుని, సమగ్ర సర్వే నిర్వహించిన తర్వాతే భూముల రిజిస్ట్రేషన్ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ప్రస్తుతం మండలాల్లో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉన్నదని, త్వరలోనే మండలానికి ఒకరు లేదా ఇద్దరు చొప్పున సర్వేయర్ల నియామకం జరుగనున్నదని, తద్వారా సర్వే తిప్పలు సైతం దూరం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, కందుకూరు ఆర్డీవో ఎస్.జగదీశ్వర్‌రెడ్డి, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, డీటీ మణిపాల్‌రెడ్డి, బడంగ్‌పేట్, మీర్‌పేట్, జల్‌పల్లి కమిషనర్లు సరస్వతి, ఆర్.జ్ఞానేశ్వర్, వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ధరణి సమస్యలకు భూభారతి పరిష్కారం

ఎల్బీనగర్ : ధరణి సమయంలో రైతులు భూసమస్యలతో చాలా ఇబ్బందులు పడేవారని ఆ సమస్యలకు భూభారతి పరిష్కారం చూపుతుందని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ చెప్పారు. సరూర్‌నగర్‌లోని మున్సిపల్ వార్డు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన భూభారతి చట్టం-2025 అవగాహన సదస్సులో పాల్గొన్న ఆమె చట్టంలోని కీలక అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం, భూభారతి చట్టం-2025 ద్వారా రైతులకు సులభంగా న్యాయమైన సేవలు అందిస్తామన్నారు. సదస్సులో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, కార్పొరేటర్లు వెంకటేశ్వర్ రెడ్డి, సుజాతానాయక్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగం ద్వారా చెత్తను తరలించేందుకు నియమితులైన 814 మంది సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అవుట్ సోర్సింగ్ ట్రాన్స్‌ఫోర్ట్ అధ్యక్షుడు మంద రవీందర్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మలక్‌పేటలోని జీహెచ్ఎంసీ సీటీవో కార్యాలయంలో డీఆర్ఎఫ్ నుంచి తిరిగి ట్రాన్స్‌ఫోర్ట్ విభాగానికి బదిలీ చేసిన వందలాది మంది కార్మికులను విధుల్లోకి తీసుకొనేందుకు నిరసనగా కార్మికులు కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. గ్రేటర్ కమిషనర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ట్రాన్స్‌ఫోర్ట్ విభాగాన్ని నమ్ముకుని పనిచేస్తున్న వందలాది మంది కార్మికులను రాతపూర్వకంగా కాకుండా మాట పూర్వకంగా చెత్తను తరలించే విభాగమైన ట్రాన్స్‌ఫోర్ట్ విభాగం నుంచి 18నెలల క్రితం డీఆర్ఎఫ్‌కు బదిలీ చేశారు. అప్పట్లో డీఆర్ఎఫ్ ద్వారా పార్కులు, చెరువుల వద్ద డ్యూటీలు చేసిన 814 మంది కార్మికులను మంగళవారం రాత్రి తిరిగి జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగాలైన మలక్‌పేట, కవాడిగూడ, ఖైరతాబాద్‌లకు మాట పూర్వకంగా బదిలీ చేశారు. బుధవారం ఉదయం విధుల్లోకి చేరేందుకు వచ్చిన కార్మికులకు మలక్‌పేట సీటీవో కార్యాలయం డీఈ వినయ్‌భూషణ్ విధుల్లోకి తీసుకోవడానికి నిరాకరించారు. తనకు గ్రేటర్ కమిషనర్ నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందని కారణంగా డీఆర్ఎఫ్ నుంచి బదిలీ అయిన కార్మికులను విధుల్లోకి తీసుకోవడానికి నిరాకరించారని మంద రవీందర్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను జీహెచ్ఎంసీ ట్రాన్స్‌ఫోర్ట్ విభాగంలో పనిచేసే కార్మికులందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 814 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని ధర్నాలో కార్మికులు స్పష్టం చేశారు.



జీహెచ్ఎంసీ సీటీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



గురుకుల స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో సెక్రెటరీ సైదులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాటసింగారంలోని బీసీ గురుకుల స్కూల్‌లో స్వశోధన్ ట్రస్ట్ సహకారంతో డిజిటల్ ఎడ్యుకేషనల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ గురుకులాల సెక్రెటరీ సైదులు(ఐఎఫ్ఎస్) ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గురుకుల విద్యార్థులు డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. గ్రామీణ పేద వి ద్యార్థుల కోసం ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో స్వశోధన్ ట్రస్ట్ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, హరికృష్ణ, గురుకుల స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఆర్‌సీవో వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ మనీ పేరు చెప్పి రూ.1.75లక్షల టోకరా

చాదర్‌ఘాట్ : మ్యాజిక్ మనీ పేరు చెప్పి ఓ వ్యక్తి రూ.1.75లక్షలతో టోకరా కొట్టిన సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి నివాసి దుద్దాల సాయికల్యాణ్‌కు ఏడాది నుంచి బి. ఆనంద్‌తో పరిచయం ఏర్పడింది. ఆనంద్‌కు కందా శ్రీనివాస్ అనే స్నేహితుడున్నాడు. ఈనెల 16న ఆనంద్, సాయికల్యాణ్‌ను కందా శ్రీనివాస్‌కు పరిచయం చేశాడు. ఈ పరిచయానికి వారం ముందే ఆనంద్ సాయి కల్యాణ్‌కు మ్యాజిక్ మనీ గురించి చెబుతున్నాడు. ఆర్థిక సమస్యలను పరిష్కరించుకోవడానికి శ్రీనివాస్‌ను కలవాలని, మ్యాజిక్ మనీ ట్రిక్ ద్వారా డబ్బు రెట్టింపు చేయడం శ్రీనివాస్‌కు తెలుసని చెప్పాడు. ఈ విషయాన్ని సాయికల్యాణ్‌కు చెప్పిన తర్వాత ఆనంద్ సాయి కల్యాణ్‌ను చైతన్యపురిలోని విద్యుత్‌నగర్ రోడ్డు నంబర్ 8లో గల కందా శ్రీనివాస్ ఇంటికి ఈనెల 16న తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత శ్రీనివాస్ రవికి ఫోన్‌చేశాడు. రవి సాయికల్యాణ్‌కు మాయమాటలు చెప్పగా ఆనంద్, శ్రీనివాస్ సమక్షంలో సాయి కల్యాణ్ రూ.1.75లక్షల నగదు రవికి ఇచ్చాడు. ఈ డబ్బుకు రూ.5లక్షలు ఇస్తానని రవి చెప్పి ఆ డబ్బునంతా బ్రౌన్ కలర్ బాక్స్‌లో వేసి పైన ఉన్న ఆకుపచ్చ రంగు టేప్‌తో చుట్టి దానికి పింక్ ఇంజెక్షన్ ఇచ్చి శ్రీనివాస్ ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌లో పెట్టి సాయంత్రం తిరిగి వస్తానని చెప్పి రవి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రెండు రోజుల తర్వాత శ్రీనివాస్ ఫ్రిజ్‌లో నుంచి పెట్టెను తీసి సాయికల్యాణ్ ఇంటికి తీసుకొచ్చాడు. వీరిద్దరు దాన్ని తెరచి చూడగా తెల్ల కాగితాలు ఉన్నాయి. దీంతో తాము మోసపోయామంటూ మ్యాజిక్ మనీ పేరుతో మోసానికి పాల్పడిన రవిపై సాయికల్యాణ్ బుధవారం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ

జోన్ బృందం : జమ్ముకశ్మీర్‌లోని పహల్‌గామ్‌ను సందర్శించేందుకు వెళ్లిన హిందూ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీజేపీ నాయకులు బుధవారం కొవ్వొతుల ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశా రు. కాల్పుల్లో మరణించిన పర్యాటకుల ఆత్మశాంతిని కాంక్షిస్తూ మౌనం పాటించారు.

మలక్‌పేటలో ఎమ్మెల్యే బలాల..

హైదరాబాద్ సిటీ : కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆధ్వర్యంలో ముస్లింలు, కాలనీ సంఘాల ప్రతినిధులు, పలు పార్టీ నేతలతో మలక్‌పేటలో బుధవారం రాత్రి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతులకు ఆత్మశాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులు అర్పించారు.



బడంగ్‌పేట్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో శ్రీరాములుయాదవ్ తదితరులు



సరూర్‌నగర్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మతో కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, బీజేపీ నేతలు



కొవ్వొత్తులతో నిరసన ర్యాలీలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు భరత్

మేడే వేడుకల పోస్టర్లు ఆవిష్కరణ

సరూర్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మేడే వేడుకల్లో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ బాలాపూర్ మండల కమిటీ అధ్యక్షుడు దాసరి బాబు కోరారు. బుధవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేడే వేడుకల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ.26వేలు చేయాలని, ఇతర సదుపాయాలు కల్పించాలని, 8గంటల పని దినాన్ని అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని బాబు పేర్కొన్నారు. మే 1వ తేదీన ప్రతి గ్రామంలోనూ మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి చారి, వెంకటయ్య, మల్లికార్జునతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్మికులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ : మే డేను పురస్కరించుకుని బుధవారం తుర్కయంజాల్ చౌరస్తా వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. కిషన్ మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, సత్యనారాయణ, మల్యాద్రి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పెళ్లి సంబంధాలు కుదరడం లేదని

యువతి ఆత్మహత్య

సంతోష్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్థాపానికి గురైన ప్రైవేటు ఉద్యోగిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేట మారుతినగర్‌కు చెందిన సుచిత్ర(33) ప్రైవేటు ఉద్యోగి. తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి ఉంటుంది. కొన్ని రోజులుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నా అవి కుదరకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పై కప్పు గోడకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నార్సింగి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య పర్యవేక్షకురాలుగా పనిచేస్తున్న తల్లి అనమ్మ విధులు ముగించుకొని రాత్రి 9.30గంటల సమయంలో ఇంటికి రాగా తలుపులు వేసి ఉన్నాయి. చాలా సార్లు తలుపు తట్టినా తెరవకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులను తెరవగా కూతురు ఉరేసుకొని ఉంది. విషయాన్ని పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలంలో దొరికిన సుసైడ్‌నోట్‌లో తన మృతికి ఎవరూ కారణం కాదని, తను జీవితంలో అలిసిపోయాను అని అందరూ నన్ను క్షమించాలని రాసింది. ఈ మేరకు తల్లి అనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సుచిత్ర(ఫైల్)